## సేవాధర్మము

రేపు ఇక్కడ ఈ సన్నిధిలో జరిగే 400 ఉపనయనాల కొరకు దేశముయొక్క నాలుగు మూలల నుంచి వేలాదిమంది వస్తారు. వారు శివరాత్రి వైభవాలను దర్శించే కొరకు అంతవరకు నిలయములో వుంటారు. శివరాత్రి కొరకు మామూలుగా వచ్చే వేలాది ప్రజలతో వీరూ చేరి, బ్రహ్మాండ జనసమూహము సమావేశమవుతుంది. కాబట్టి, వాలంటీర్లు అనుపించుకొని వారి సేవకొరకు నిలచిన మిమ్ములను ప్రత్యేకముగా పిలచి, మీకు కొన్ని విషయములను చెప్పదలచాను. సేవయంటే దానికికూడ, క్రమశిక్షణ కావాలి, భక్తిశ్రద్ధలు కావాలి. ఎన్నో సంవత్సరములు సత్సంగములో కలసిమెలసి వినయవిశ్వాసములు పెరగాలి. ఎప్పటికప్పుడు ఎవరూ వాలంటీరుగా తయారుకారు. బ్యాడ్జిని షర్ట్‌పైన తగిలించిన తక్షణమే, సేవామనోభావము హృదయములో అంకురించి అభివృద్ధి పొందును.

అన్నింటికంటే, ఆజ్ఞయొక్క మహత్వమును మీరు తెలుసుకోవాలి. గీతకూడా కృష్ణుడు అర్జునకిచ్చిన ఆజ్ఞయే. యుద్ధ్యస్వ విగతజ్వరః' అనేది ఆజ్ఞయే. కృష్ణుడేమో అంతమాత్రముతో నిలుపలేదు. జ్వరముయొక్క కారణమేమిటి, లక్షణాలేమిటి, దానికి చికిత్సయేమి, యుద్ధము చేసేవాడెవడు, చేయించేవాడెవడు, జయాపజయములను నిర్ణయించేది ఏది అని విస్తారముగా, సుస్పష్టముగా తెలిపినాడు. అర్జునుడు ప్రపన్నుడు. కాబట్టి, ఆజ్ఞకు అధీనుడే అయిననూ, తృప్తితో, సంతోషముతో నిస్సందేహముగా ఆజ్ఞను పరిపాలించేకొరకు, కృష్ణుడు అంత సుదీర్ఘమైన బోధను అనుగ్రహించినాడు కదా! నేనుకూడా అంతే. మీకు క్రమశిక్షణను పెడితే ఆ నియమాలను ఎట్లు పాటించాలి అని మాత్రం కాదు, ఎందుకు పాటించాలి అని కూడా తెలుపుతున్నాను. తెలిసి అనుసరిస్తే ఫలితము ఎక్కువ, శ్రద్ధకూడ ఎక్కువ అవుతుంది. భయమూ, వినయము, విశ్వాసము ఇవన్నీ భక్తుల లక్షణములు. రెండవ మాట లేకుండా, ప్రభు ఆజ్ఞ ప్రకారము త్రికరణ శుద్ధితో పని చెయ్యాలి. భక్తులు ఒకరికొకరు తోడునీడగా, సమరసముగా భక్తుల సేవ చేయాలి. వాలంటీర్లను చూచి, 'సత్సంగమంటే ఇదేకదా! ఇట్లుండాల'ని అందరూ ఆనందపడాలి.

సర్వజన సమాన ప్రేమ వాలంటీర్లకు అత్యవసరము. అందరిలోనూ సాయి ఉన్నాడు, కాబట్టి ఎవరిని ద్వేషించినా సాయినే ద్వేషించినట్లు, ఎవరిని ప్రేమించినా సాయినే ప్రేమించినట్లే. 'అంతా సాయిమయం ఈ జగమంతా బాబమయం' అని మీరందరూ భజనలో పాడుదురే! దాని అర్థము మీ అనుభవములోనికి కొంచెమైనా వచ్చివుంటే, మీ ప్రేమ నాపై మాత్రమే కాకుండా అందరిపై ప్రవహిస్తుంది. ప్రేమయున్న చోట ద్వేషాసూయలకు, పైపోటీకి, చాడికి చోటేలేదు. ఇంకొకరికి బాధకలిగించే, అశాంతి కలిగించే ఏ పనులనూ మీరు చేయకూడదు. ఎందుకంటే, నిరాబాధులుగా, శాంతితో మెలగాలని మీకూ ఆశవుందికదా! ఇతరులు మీతో ఎట్లు కలసిమెలసి వుండాలని ఆశపడతారో అట్లనే మీరూ వారితో మెలగాలి. ఇదే సుఖజీవనానికి ప్రథమ సోపానము. ఇదే మీ ప్రేమయొక్క లక్షణము. కాబట్టి, మందిరములోగాని, మీరు ఏ ఒక్క ప్రత్యేక స్థానమునకు పోట్లాడకూడదు, ఆశించకూడదు. ముందుగా వచ్చిన వారికి మొదట చోటివ్వాలి. వారితో వాదించకండి. ఏ విషయమునూ పెద్ద అల్లరిగా పెంచకూడదు. సభా ప్రవేశమునకు వచ్చినప్పుడు ఎక్కడ చోటువున్నదో అక్కడనే ముందు వాళ్ళను తరమకుండా, అందరూ శాంతముగా కూర్చోవాలి. అక్కడ, ఆ మీటింగు స్థలములోకాదు, మీరు మీ స్థానములకై ప్రయత్నించ వలసినది. ఇక్కడ, ప్రభు చిత్తములో, స్వామి హృదయములో సంపాదించండి. మీ పరార్థమును సాధించేకొరకు ఇల్లువాకిలి, వస్తువాహనాలు, బంధుమిత్రులు అన్నిటినీ దూరము చేసుకొని ఇక్కడికి వచ్చికూడ, మరి పాత అహంకారమమకారములను పోషించి, పెంచిపెద్దచేసి బాధపడేదెందుకు? భజనో, ఉపన్యాసమో ప్రారంభమైన తరువాత, ఎవరైనా అన్ని లైనులనూ దాటుకొని ముందర వచ్చి కూర్చుంటే, ఇతరుల ఏకాగ్రతకు భంగము కలిగించిన వారమౌతామని తెలిపి హెచ్చరించండి.

వాలంటీర్లు శ్రమపడాలి. నిద్రాహారములు చక్కగా దొరకాలంటే మీతో సేవ జరగదు. సుఖభోగములు అలవాటైన వారితో వాలంటీర్ల పని సాధ్యంకాదు. మీ కోరికలను తగ్గించాలి. క్రమశిక్షణతో ఇంద్రియములను అరికట్టాలి. ఇప్పుడు మీ రూములో మీ టేబులుపైన, మీ ట్రంకులో మీకు అవసరములేని ఎన్నో పదార్థములు చేరివుంటున్నాయి. ఇతరులెవరో ఉపయోగిస్తున్నారు కాబట్టి మీకూ దానిపైన ఆశ పుట్టినది. దానిని తెచ్చుకొనిననే వారు మెచ్చుతారు. లేనియెడల మీరు అప్ టు డేట్ కాదు. ఈ కారణము వల్ల అనవసరమైన ఎన్నో వస్తువులను మీరు వాడుకొని ఆ అభ్యాసాలను పాలిస్తున్నారు. ఆ అలవాటులో పడ్డారు. సుఖముగా, సంతోషముగా జీవించే కొరకు అవి అంత మీకు సహాయము చేయవు. అసలు వీటినుండి ఆటంకములే ఎక్కువ. కొన్ని దినములు ఒక పొరపాటులో పడితే అదే అలవాటైపోతుంది. ఆ అర్థములేని అభ్యాసము దృఢముగా నిల్చిపోతుంది. కాబట్టి, నిత్యజీవితాన్ని ఎంత సాధ్యమో అంత సరళముగా ఏ డాంబికము లేకుండా చేసుకోండి. అప్పుడే మీనుంచి సంఘానికి ఎక్కువ సేవాలాభము దొరికేది.

దీనికి వైరాగ్యమనికూడా అంటారు కదా! వైరాగ్యమంటే వస్తుజ్ఞానమే. ఇచ్చట ఈ వెండి విగ్రహముంది. శిర్డి సాయిబాబది. వెండిపైన మీ గమనము నిల్చితే సాయిబాబా కనబడడు. సాయిబాబా అని ఆ పూజ్యభావముతో మీ అంతఃకరణము నిండియుండిన వెండి కనబడదు. వెండి కనబడక, సాయి మాత్రమూ గోచరమైనప్పుడు వైరాగ్యము దృఢమైనదని గుర్తు. తిరుపతి వేంకటేశ్వరస్వామి

ఎదుట నిల్చుకొని, ఈ రాయి ఎక్కడిది, దానిరంగుయేమి అని ఆలోచిస్తే మీకు స్వామి కనబడదు. స్వామి అని ఆరాధిస్తే రాయినే జ్ఞప్తికి రాదు. అట్లనే, ప్రకృతి అంతయూ నిజముగా బ్రహ్మతత్త్వమే. విడివిడిగా వస్తువులు గోచరమునకు రాక అన్నింటికీ ఆధారముగానున్న బ్రహ్మతత్త్వము 'సర్వం బ్రహ్మమయం' అని తెలుసుకొనేదే వైరాగ్యముయొక్క అంతిమదశ, సాఫల్యము. అందరినీ సమముగా సేవించు, పూజించు అని ఉపదేశిస్తూన్నారే? ఈ భావము రావాలంటే బ్రహ్మతత్త్వముయొక్క సత్యాన్ని కొంచెమైనా చవిచూచి వుండాలి.

ఇంకొకటి, సేవచేసే అవకాశములు ఎచ్చట ఎప్పుడు దొరుకునోయని మీరే వెతుకుతూ వుండాలి. మీ దగ్గరకు అవి వచ్చే వరకు ఊరికే కూర్చొనకూడదు. నిలయవాసులందరూ దినమూ పక్కింటివాళ్ళ ఆరోగ్యాన్ని విచారించాలి అనే నా ఆజ్ఞయొక్క ఉద్దేశ్యముకూడా అదే. వేలాదిమందిలో పసిబిడ్డలు, జబ్బుమనుష్యులు, ముసలివారు, కుంటివారు, గుడ్డివారు వీరికి మీరు విశేష గమనమీయాలి. నిలయముయొక్క ఆవరణములో మాత్రము కాదు. చుట్టూ రాస్తాలలో, నదీ తీరములోకూడ. వారితో మృదువుగా సంభాషించి, ఏమి సాయము కావాలని మీరే విచారించండి. నేను అందరితోనూ యింత మధురముగా మాట్లాడుతున్నానే, మీరు మాత్రము ఏమీతెలియని అమాయకుల దగ్గర కఠినముగా, కౄరముగా మాట్లాడవచ్చునా? వారివారి ఊర్లకు పోయి చేరినప్పుడు, 'మా నిజమైన బంధువులు ఇచ్చట కాదు, అచ్చట వున్నారు' అని సంతోషపడని.

వాలంటీర్లు ఎప్పుడూ ఆనందముగా సంతోషముగా సేవ చేయాలి. మిమ్ములను చూచి, ఇతరులు తమ కష్టనష్టములు మరచి, ఆనంద ప్రవాహములో చేరాలి. మీ కష్టాలను ఇతరుల చెవిలో పోసి వారి కెందుకు అశాంతి ఇచ్చేది? మీ పేరు ప్రతిష్ట తెలియని వారెదుట ఎందుకు మీ నగానట్రాల విషయము వివరించేది. ఇతరులకు ధైర్యమిచ్చి, వారిని ఓదార్చి, వారికి మనోబలమిచ్చి, మంచి తెలివినిచ్చి, మీరూ ఆనందపడండి. దానికి కావలసిన సామర్థ్యమును సంపాదించండి. ఇప్పుడు, ఇన్ని వేలమందిలో, మీకు నేను అనుగ్రహించిన ఈ అవకాశమును సదుపయోగపరచి జీవితమును సార్థకము చేసుకోండి.

ఒకనికి ఏదో సేవ చేసేటప్పుడు పెద్ద ఉపకారమును అందించినట్లు గర్వపడకండి. ఆ భాగ్యము దొరికినదే అని ఆనందించండి. మరి మరి అటువంటి అవకాశము కొరకు ఆవేదనతో కనిపెట్టుకొని వుండాలి. ఇక్కడ, ఎంతోమంది జపధ్యానములను మందిరములోనూ వారి వారి గదులలోనూ చేస్తూంవుంటారు. వారికి అడ్డు చేయకుండటమే పెద్ద ఉపకారము. ప్రణవోపాసన ముహూర్తములో పసిబిడ్డని షెడ్డులో పరుపు పైన వుంచి, తల్లి మందిరానికి వెడితే, ఆ బిడ్డ గట్టిగా ఏడ్వటం మొదలు పెడితే లేడీ వాలంటీర్లు ఎవరైనా పోయి ఆ పాపని ఎత్తుకొని ఓదార్చి నిద్ర చేయించవచ్చు. అప్పుడు తల్లియొక్క ఉపాసనా ఫలములో కొంచెం ఆ వాలంటీరుకు దొరుకుతుంది.

'అరచవద్దు' 'గట్టిగా మాట్లాడవద్దు' అని ఊరకే గదరిస్తే ప్రయోజనము లేదు. 'బాబావారు అట్లని ఆజ్ఞ ఇచ్చినారు' అని అంటేకూడా చాలదు. సాధనా మార్గములో నిశ్శబ్దం ప్రథమ సోపానం, మితభాష అతిహాయి, ఇది 'ప్రశాంతినిలయము'. తాను వున్న ప్రదేశమును ప్రశాంతినిలయముగా చేసేదే భక్తుని లక్ష్యము. ఇతరుల సాధనలకు అడ్డు చేయకూడదు. క్షేత్రములలో నేత్ర శబ్దమేగానీ పాత్ర శబ్దము వినబడకూడదు అని దానికి కారణాలను విశదముగా తెలుపండి. అట్లచేస్తే, వారికి గౌరవమిచ్చినట్లు, మీకూ గౌరవము దొరుకుతుంది.

ప్రశాంతినిలయము.

24ఫిబ్రవరి1965